సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 30 । జూన్ । 2023



ట్రావెల్స్ బస్సు బోల్తా

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. - 8లో



ఆన్‌లైన్ షాపింగ్.. క్రేజ్

ఆన్‌లైన్ షాపింగ్ యువతను ఆకర్షిస్తోంది. ఏ వస్తువునైనా ఆన్‌లైన్ లోనే తెప్పించుకుంటున్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35°/26°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

1న పాఠశాలలు బంద్

భువనగిరి టౌన్ : జూలై 1న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 70 పాఠశాలల్లో గ్రూప్–4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ సమన్వయ అధికారి షకీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నల్లగొండలోని ఆర్‌సీఓ కార్యాలయంలో జూలై 6వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నాగార్జునసాగర్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరిలోని గురుకులాల్లో ఇంగ్లిష్, తెలుగు, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ తదితర సబ్జెక్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారని తెలిపారు. పీహెచ్‌డీ, సెట్, నెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 08682224566 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యాదాద్రీశుడికి రూ.2.51లక్షల విరాళం



అధికారికి నగదు అందజేస్తున్న శ్యామ్‌లాల్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి ఆరు వెండి కలశాల తయారీ కోసం యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన గౌళికార్ శ్యామ్‌లాల్ గురువారం రూ.2.51లక్షలు విరాళంగా అందజేశారు. తన తండ్రి గౌళికార్ నర్సోజీ జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు శ్యామ్‌లాల్ తెలిపారు. అంతకుముందు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మ వారిని దర్శించుకున్నారు.

రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ సునీత

ఆలేరురూరల్ : పట్టణంలోని రైల్వే అండర్‌పాస్ పనులను గురువారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు.ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారందరి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని, ఇంకా పడని వారుంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, జూకంటి శంకర్, గ్యాదపాక నాగరాజు, అడెపు బాలస్వామి, సీసా మహేశ్వరి, పూల శ్రవణ్, దయ్యాల సంపత్, పత్తి వెంకటేష్ పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి



మాట్లాడుతున్న అభిలాష్

భువనగిరిటౌన్ : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు సొంత రేట్లు నిర్ణయించుకొని ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, నియంత్రణకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వస్తుపుల అభిలాష్, ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తిరుపతిరావు కమిటీ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు టైలు, బెల్ట్‌లు, పుస్తకాలు విక్రయించవద్దన్నారు. అయినా యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయని, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫీజులను నియంత్రించకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరారం జానీ, చిప్పలపల్లి ధనుష్, పత్తి ప్రకాష్, నాగారం రామ్ చరణ్, సూరారం కళ్యాణ్, బూడిద సాయి చరణ్ పాల్గొన్నారు.

• భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ సందర్భంగా గురువారం భువనగిరిలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : తొలి ఏకాదశి, స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన జరిపారు. అంతకు ముందు వేకువజామున ప్రధానాలయంలో సుప్రభాతం, ఆరాధన, అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ముఖమండపంలో స్వాతి హోమం, 108 కలశాలకు ప్రత్యేక పూజలతో పాటు శుద్ధజలం, ఫలామృతాలతో శతఘటాభిషేకం నిర్వహించారు. అదే విధంగా ఆలయంలో నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు.



స్వామి, అమ్మవారికి పుష్పార్చన నిర్వహిస్తున్న ఆచార్యులు

ప్రాణం తీస్తున్నారు!

రైళ్లలో వెళ్తున్న ప్రయాణికులపై దాడులు

- ఫుట్‌బోర్డులో ఉన్నవారిపైకి రాళ్లు, కర్రలు విసురుతున్న దుండగులు
- సెల్‌ఫోన్ల కోసం ఘాతుకం
- కిందపడ్డ ఫోన్లను తీసుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- మార్చి నుంచి ఏడుగురు మృతి
- గుర్తు తెలియని వ్యక్తులుగా కేసు నమోదు



రైల్లో సీట్లు లేకపోవడంతో ఫుట్‌బోర్డులో కూర్చొని వెళ్తున్న ప్రయాణికులు (ఫైల్)



హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం నెరేళ్ల గ్రామానికి చెందిన ముప్పు శ్రీకాంత్ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సెలవు ఉండడంతో బుధవారం సాయంత్రం సికింద్రాబాద్ నుంచి శాతవాహన సూపర్ ఫాస్ట్‌ఎక్స్‌ప్రెస్ రైల్‌లో ఖాజీపేటకు బయలుదేరాడు. రైల్ ఫుట్‌బోర్డులో నిలబడి సెల్‌ఫోన్ చూస్తుండగా బీబీనగర్ సమీపంలో ట్రాక్ పక్కన కాపుకాసిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు శ్రీకాంత్‌పై కర్ర విసిరారు. ఈ ఘటనలో శ్రీకాంత్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్ కిందపడింది. ఫోన్ తీసుకునే ప్రయత్నంలో శ్రీకాంత్ రైలు కింద పడిపోయాడు. ప్రయాణికులు వెంటనే చైన్ లాగడంతో రైలు కొద్దిదూరం వెళ్లి ఆగింది. వారంతా వచ్చి చూడగా అప్పటికే శ్రీకాంత్ మృతి చెందాడు. దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. రైల్వే అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి యాదాద్రి : సికింద్రాబాద్ – ఖాజీపేట రైల్వే మార్గంలో దుండగుల అఘాయిత్యాలు నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. ఫుట్‌బోర్డు జర్నీ చేస్తున్న వారిపైకి రాళ్లు, కర్రలు విసురుతున్నారు. సెల్‌ఫోన్ల కోసం ఒడిగడుతున్న ఈ దుశ్చర్యల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలోని బీబీనగర్, పగిడిపల్లి, భువనగిరి, ఆలేరు పరిధిలో ఇటువంటి ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

ట్రాక్ పక్కన మాటువేసి..

ఘట్‌కేసర్, బీబీనగర్, పగడిపల్లి, అనంతారం, భువగగిరి, ఆలేరు వద్ద ఇటీవల రైళ్లపై దుండగులు కర్రలు, రాళ్లతో దాడి చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా క్రాసింగ్‌ల వద్ద, ట్రాక్ పనులు జరుగుతున్న చోట ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. దొంగలు, ఆకతాయిలు ట్రాక్ పక్కన కాపు కాసి రైలు దగ్గరకు రాగానే ఫుట్‌బోర్డులో సెల్‌ఫోన్లు చేతిలో పట్టుకుని కూర్చున్న ప్రయాణికులపై రాళ్లు, కర్రలు రువ్వుతున్నారు. సెల్‌ఫోన్లు కిందపడగానే దుండగులు వాటిని తీసుకుంటున్నారు. మరోవైపు ప్రయాణికులు తమ చేతిలోనుంచి సెల్‌ఫోన్లు కింద పడుతున్న క్రమంలో అందుకునేందుకు చేసే ప్రయత్నంలో రైల్‌లో నుంచి పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కాగా రెండు నెలల క్రితం ఆలేరు బీసీ కాలనీ సమీపంలో నలుగురు యువకులపై రాళ్లు రువ్విన ఘటనలో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

చోటు చేసుకున్న ఘటనలు ఇలా..

అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా నమోదైన కేసులన్నీ 20 నుంచి 35 ఏళ్ల వయస్సు లోపువారే కావడం గమనార్హం. ఇవన్నీ బీబీనగర్ నుంచి భువనగిరి మధ్యలోనే జరిగాయి. మార్చి 6, మార్చి 7, ఏప్రిల్ 21, ఏప్రిల్ 24, జూన్ 20, జూన్ 22, జూన్ 28వ తేదీ వరకు ఏడుగురు గుర్తు తెలియని వ్యక్తులు రైళ్లలోనుంచి జారిపడి మృతి చెందినట్లుగా కేసులు నమోదు చేశారు. అయితే 22వ తేదీన పగడిపల్లి వద్ద రైల్ లోంచి జారిపడిన కేసులో బిహార్‌కు చెందిన రతన్(29)గా, 28న చోటు చేసుకున్న ఘటనలో ముప్పు శ్రీకాంత్‌గా గుర్తించారు. ఒకే తరహాలో జరుగుతున్న అనుమానాస్పద మరణాలపై విచారణ జరిపించాలని, ట్రాక్‌వెంట కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రూ. 6,500 కోట్లతో అభివృద్ధి

- తుంగతుర్తి నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి
- కిషోర్‌ను ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలి
- ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కిషోర్, సునీత, జెడ్పీ చైర్మన్లు తదితరులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.6,500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ఇంతటి అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా 40 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. తిరుమలగిరిలో గురువారం జరిగిన తుంగతుర్తి ప్రగతి నివేదన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రాజకీయ కొట్లాటలు, హత్యలు జరిగేవని, ప్రతి గ్రామంలో ఫోరీలు, స్థూపాలు ఉండేవని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తరువాత అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నియోజకవర్గంలో 36,491 ఎకరాల ఆయకట్టు ఉండేదని, కాళేశ్వరం జలాలు రావడంతో లక్షా 41వేల ఎకరాలకు నీళ్లు అందుతున్నాయని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 28తండాలను పంచాయతీలుగా మార్చామని కేటీఆర్ చెప్పారు. ఉమడి నల్లగొండ జిల్లాలో గత ప్రభుత్వాల హయాంలో ఫ్లోరైడ్‌తో మనుషులు జీవచ్ఛవాలుగా మారారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఫ్లోరైడ్‌ను తరిమేశామన్నారు. తిరుమలకు దీటుగా యాదాద్రిని తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో ఒక్క మెడికల్ కళాశాల లేకుండగా ప్రస్తుతం మూడు మెడికల్ కళాశాలలు తెచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

నాలుగున్నరేళ్లుగా పత్తా లేరు : మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రతిపక్ష పార్టీలు నాలుగేళ్లుగా పత్తా లేకుండా పోయాయని, మళ్లీ ఎన్నికలు రావడంతో వృద్ధ సింహాలు పాదయాత్రలు మొదలు పెట్టాయని మంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వీరి పాదయాత్రల్లో ప్రజలే లేరని విమర్శించారు. కాంగ్రెస్ నేతలను ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు బండకేసి కొడితే నాలుగేళ్లుగా మూలకు కూర్చొని మూలుగుతూ, ముక్కుతూ మళ్లీ పాదయాత్రల పేరుతో రోడ్డెక్కి ప్రజలకు మాయ మాటలు చెప్పడానికి తిరుగుతున్నారని విమర్శించారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు.

మూడోసారి కూడా గులాబీ జెండా ఎగరాలి : ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తొమ్మిదిన్నర సంవత్సరాల్లో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్లిందన్నారు. తిరుమలగిరి మండలం దళితబంధు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికవడంతో రూ.230 కోట్లు లబ్ధిదారులకు అందాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనపై 172 కేసులు నమోదయ్యాయని, 60 రోజులు జైలుకు వెళ్లానని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, మూడవసారి కూడా గులాబీ జెండాను ఎగుర వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, సూర్యాపేట, భువనగిరి, నల్లగొండ జెడ్పీ చైర్మన్లు గుజ్జ దీపికాయుగేంధర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీందర్‌నాయక్, సైదిరెడ్డి, మల్లయ్య యాదవ్, భాస్కర్‌రావు, భరత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, మార్కెట్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్లు సందీప్‌రెడ్డి, దీపిక తదితరులు

ఆరు రాష్ట్రాల్లో సేవలందిస్తున్నాం

- సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వైస్ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి

చౌటుప్పల్: దేశంలోని పలు రాష్ట్రాల్లో 42శాఖలతో ఈ ఏడాది మార్చి చివరి నాటికి తమ సంస్థ రూ.3469.81కోట్ల వ్యాపారం చేసిందని సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వైస్ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో తమకు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. చౌటుప్పల్‌లో బ్రాంచ్ ఏర్పాటు చేసి 15ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం మొత్తంలో తమ సంస్థలో రూ.1863.48కోట్ల డిపాజిట్లు, రుణాల రూపంలో రూ.1606.33కోట్లు ఉన్నాయన్నారు. మొత్తంగా రూ.74కోట్లు లాభం వచ్చాయని తెలిపారు. ఎండీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇతర సహకార బ్యాంకులతో పోలిస్తే ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో తమ సంస్థ ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఏ.సోమలింగంగౌడ్, శ్రీనివాసులు, స్థానిక మేనేజర్ బొడ్డుపల్లి అంజయ్య, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణ పరిధిలోని డాన్‌బోస్కో అకాడమీలో నిర్వహిస్తున్న చండూరుకు చెందిన సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆర్‌సీఓ హెచ్.అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించిన వారు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను దరఖాస్తు ఫారానికి జతపరిచి కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.భిక్షమయ్య సెల్ : 7995010669 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి

- బీజేపీ మున్సిపాలిటీ విస్తారక్ చైతన్య



బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

చౌటుప్పల్ : వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ చౌటుప్పల్ మున్సిపాలిటీ విస్తారక్ చైతన్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో నిర్వహించిన భక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పని చేయాలన్నారు. జూన్ 3లోపు శక్తి కేంద్రాల సమావేశాలను పూర్తి చేయాలని, 4నుంచి మున్సిపాలిటీ పరిధిలోని 24 బూత్‌లలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించాలన్నారు. అనంతరం బూత్‌ల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ బలం ఏ స్థాయిలో ఉందని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి గుజ్జుల సురేందర్‌రెడ్డి, బత్తుల జంగయ్య, కాసుల వెంకటేశం కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, తడక సురేఖ, ఎర్ర గణేష్, చీకూరి వెంకటేశం, తదితరులు ఉన్నారు.

రామన్నపేటకు మహాజన సంపర్క్ అభియాన్ పరిశీలకురాలు

రామన్నపేట : బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం పరిశీలకురాలిగా నియమితులైన మైత్రీ గురువారం రామన్నపేటలో పర్యటించారు. రామన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో శక్తి కేంద్రాల్లో నిర్వహించనున్న మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాల్లో వారం రోజుల పాటు పాల్గొననున్నారు. శక్తి కేంద్రాల పరిధిలో వివిధ వర్గాల ప్రజలు, ప్రముఖులను కలిసి మోదీ పథకాలను వివరించడంతో పాటు వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. అంతకుముందు పార్టీ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, కార్యదర్శి గర్దాసు సురేష్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏలూరి శ్యాం, నియోజవర్గ కో కన్వీనర్ మదూరి ప్రభాకర్‌రావ్, మండల అధ్యక్షుడు తాటిపాముల శివక్రిష్ణ, యువమోర్చా మండల అధ్యక్షుడు అక్కెనపల్లి సైదులు వనం అంజయ్య, పల్లపు దుర్గయ్య, బట్టె రమేష్, ప్రభాకరాచారి పాల్గొన్నారు.



మైత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

బాల్యానికి బలవర్ధక ఆహారం!

- ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ
- విద్యా దినోత్సవం రోజునుంచే 31 పాఠశాలల్లో ప్రారంభం
- రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు
- 60 వేల మంది విద్యార్థులకు లబ్ధి



రామన్నపేట మండలం జనంపల్లి ప్రాథమిక పాఠశాలలో రాగిజావ సేవిస్తున్న విద్యార్థులు

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించే కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి రాగిజావ పంపిణీకి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించిన విద్యా దినోత్సవంలో ప్రయోగాత్మకంగా 31 పాఠశాలల్లో అమలు చేశారు. జూలై 1నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేయనున్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకమైన మెనూ రూపొందించి నాణ్యమైన భోజనం అందజేస్తోంది. ఇందులో భాగంగా భోజనంలో వారానికి మూడు రోజులు గుడ్డు అందిస్తున్నారు. మిగిలిన మూడు రోజులు రాగిజావ అందజేయడానికి సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ముందుకు వచ్చింది. ఒక్కో విద్యార్థికి రోజుకు 10 గ్రాములు రాగి, 10 గ్రాముల బెల్లం పౌడర్ చొప్పున ప్యాకెట్ల రూపంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు ట్రస్టు నిర్వాహకులు అందజేయనున్నారు. జిల్లా కేంద్రం నుంచి స్కూల్ పాయింట్లకు చేరవేసి మధ్యాహ్న భోజన ఏజెన్సీతో రాగిజావ తయారు చేయించి పిల్లలకు అందజేస్తారు. ఇప్పటికే ఈ నెల 20న విద్యాదినోత్సవం నుంచి జిల్లాలోని 31పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నారు. జూలై 1నుంచి జిల్లా వ్యాప్తంగా అన్నిపాఠశాలల్లో అమలు చేయడానికి యంత్రాంగం సన్నద్ధమవుతోంది. 1నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ రాగిజావ అందించనున్నారు.

పాఠశాలలు, విద్యార్థులు ఇలా..

జిల్లాలో 488 ప్రాథమిక, 70 ప్రాథమికోన్నత, 171 ఉన్నత పాఠశాలలు, 60వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రాగిజావతో వారందరికీ ప్రయోజనం చేకూరుతుంది.

మధ్యాహ్నం వరకు ఆకలి వేయడం లేదు



జనంపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నా. జూన్ 20 నుంచి మా పాఠశాలలో రాగిజావ అందజేస్తున్నారు. మధ్యాహ్నం వరకు ఆకలి వేయడం లేదు. పాఠాలు శ్రద్ధగా వింటున్నా. ఆహారం మంచిగా జీర్ణం అవుతుంది.

–గట్టు అభిరామ్, విద్యార్థి, జనంపల్లి

పిల్లలకు ఎంతో మేలు



విద్యార్థుల్లో చాలామంది ఉదయం టిఫిన్ చేయకుండా బడి వెళ్తారు. మధ్యాహ్నం వరకు ఖాళీ కడుపుతోనే ఉండడంతో నీరసించిపోతారు. పాఠాలు కూడా సరిగ్గా వినరు. రాగిజావ వల్ల పిల్లల ఆకలి తీరడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది.

– పున్న లక్ష్మి, జెడ్పీటీసీ, రామన్నపేట

ఎదుగుదలకు దోహదం



రాగిజావలో ప్రొటీన్లు, కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఇవి పిల్లల ఎదుగుదలకు దోహదపడుతాయి. క్యాల్షియంతో ఎముకలు గట్టిపడుతాయి. మలబద్ధకం తగ్గిస్తుంది. ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. పిల్లలకు ఉదయం వేళ ఇవ్వడం వల్ల వారిలో చురుకుదనం, ఏకాగ్రత పెరిగి చదువుపై దృష్టిసారిస్తారు.

–డాక్టర్ పురుషోత్తం, చిన్నపిల్లల వైద్య నిపుణులు

అన్ని పాఠశాలల్లో అమలు చేస్తాం



జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎంపిక చేసిన 31 పాఠశాలల్లో రాగిజావ పంపిణీ విజయవంతంగా కొనసాగుతోంది. పిల్లలు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోంది. పిల్లలు చదువుపై ఏకాగ్రత చూపుతున్నారు. మిగిలిన పాఠశాలల్లో జూలై 1వ తేదీనుంచి అమలు చేస్తాం.

–నారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

ఐసెట్‌లో నల్లగొండ వాసికి 6వ ర్యాంకు



సుమంత్ కుమార్‌రెడ్డి

నల్లగొండ: పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు సాయికృష్ణానగర్ కాలనీకి చెందిన తిరుగుడు సుమంత్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రకటించిన టీఎస్ ఐసెట్ ఫలితాల్లో 148.88 మార్కులతో స్టేట్ 6వ ర్యాంకు సాధించాడు. సుమంత్‌కుమార్‌రెడ్డి 2015లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ), జంషెడ్‌పూర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. సుమంత్‌కుమార్‌రెడ్డి తండ్రి తిరుగుడు దామోదర్‌రెడ్డి కాకినాడలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. తల్లి విజయ నల్లగొండలోని ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న సుమంత్‌కుమార్ రెడ్డి ఎంబీఏ చేయాలన్న ఉద్దేశంతో ఐసెట్ రాసి స్టేట్ 6వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నాడు.

14వ ర్యాంకు సాధించిన ఉప్పల కౌశిక..



ఉప్పల కౌశిక

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు చెందిన ఉప్పల కౌశిక టీఎస్ ఐసెట్ ఫలితాల్లో 200 మార్కులకు గాను 141 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు కైవసం చేసుకుంది. కౌశిక హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో గల శ్రీనిధి ఇంజనీరింగ్ పూర్తిచేసింది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో క్యాట్ పరీక్షకు సన్నద్ధమవుతోంది. ఆమె తల్లి జగన్మోహిని గృహిణి, తండ్రి గోపాలకృష్ణమూర్తి హుజూర్‌నగర్‌లోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పెన్‌పహాడ్: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని రంగయ్యగూడెం గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. తెలిపిన వివరాల ప్రకారం.. రంగయ్యగూడెం గ్రామానికి చెందిన ఇరుగు ఏసు(51) దినసరి కూలీ. ప్రతిరోజు సూర్యాపేట పట్టణంలో కూలీ పనులకు వెళ్లి ఇంటికి వస్తుండేవాడు. రోజు మాదిరిగా బుధవారం రాత్రి కూడా పనికి వెళ్లి వచ్చిన తర్వాత ఇంట్లో నిద్రించిన ఏసు గురువారం తెల్లవారేసరికి విగతజీవిగా కనిపించాడు. కాగా ఏసు మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

హత్యా.. ప్రమాదమా..?

బీబీనగర్: మండల కేంద్రంలో బుధవారం రైలు కింద పడి మృతిచెందిన యువకుడిది హత్యా లేదా ప్రమాదమా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మృతుడు హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపురం మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన ముక్కు శ్రీకాంత్(30)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ తనకు సెలవు దొరకడంతో ఇంటికి వెళ్లేందుకు శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరినట్లు భువనగిరి ఏరియా ఆస్పత్రికి మృతదేహం కోసం వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు చెప్పుకొచ్చారు. కాగా శ్రీకాంత్ రైలులో డోర్ వద్ద ఫుట్‌బోర్డుపై కూర్చొని సెల్‌ఫోన్‌ను చూస్తుండగా ఆకతాయిలు ఘర్షణకు దిగి అతడిని రైలు నుంచి కిందకు తోసేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా బీబీనగర్–పగిడిపల్లి మార్గంలో దోపిడీ దొంగలు రైల్వే ట్రాక్‌ల గుండా కాపలా కాస్తూ డోర్‌ల వద్ద ఉండే ప్రయాణికులను బయట నుంచి కర్రలతో కొట్టి వారు కింద పడగానే దోపిడీకి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై రైల్వే పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఆన్‌లైన్ షాపింగ్.. క్రేజ్

- ఈ-కామర్స్‌కు పెరుగుతున్న డిమాండ్
- చిన్న పట్టణాలకూ విస్తరించిన ఆన్‌లైన్ మార్కెట్
- ప్రతి రోజు వేల సంఖ్యలో ఆర్డర్లు
- వస్తువు ధర.. నాణ్యతను పరిశీలించి కొనుగోలు
- నచ్చకపోతే రిటర్న్ చేసేందుకు వెసులుబాటు
- అరచేతిలో ప్రపంచ మార్కెట్



నల్లగొండలోని ఓ ఆన్‌లైన్ డెలివరీ సెంటర్‌లో పార్సిళ్లను వేరుచేస్తున్న సిబ్బంది



ఆన్‌లైన్ వ్యాపారం యువతను ఆకర్షిస్తోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెట్టడానికి ఎగబడుతున్నారు. కరోనా తర్వాత ప్రజల జీవనంలో వచ్చిన మార్పులతో ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. గతంలో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు మాత్రమే తెప్పించుకొనే వారు. ఇప్పుడు అన్నింటికీ ఆన్‌లైన్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ వ్యాపారంలో ఉన్న సంస్థలు నిత్యం వివిధ ఆఫర్లతో భారీ ప్రకటనలు ఇస్తుండడంతో యువత అటువైపు మొగ్గుచూపుతోంది. ఆర్డర్ పెట్టిన వస్తువు నిర్ణీత సమయానికి ఇంటి ముందుకు వచ్చి చేరుతుండడం.. ఆ వస్తువు నచ్చకపోతే తిరిగి పంపే వెసులుబాటు ఉండడం.. వస్తువు వచ్చిన తరువాతే డబ్బులు చెల్లించేందుకు అవకాశం ఉంది. నెలవారీగా వాయిదాల రూపంలో సొమ్ము చెల్లించి వస్తువులు కొనుగోలు చేసే సౌలభ్యాన్ని కూడా ఆయా కంపెనీలు కల్పిస్తుండడంతో అంతా ఆన్‌లైన్ వైపు పరుగెడుతున్నారు. అయితే, ఆన్‌లైన్‌లో వస్తువులను కొనడం కొందరికి వ్యసనంగా మారిందని మానసిక నిపుణులు అంటున్నారు.

ఆహారం.. చిటికెలో ఆర్డర్!

యువత ఇప్పుడు తినుబండారాలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తోంది. పట్టణాల్లో హోటళ్లు కూడా ఆన్‌లైన్ సేవలు అందిస్తుండడంతో ఆర్డర్లు పెట్టేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు కూడా నిత్యం ఆర్డర్లు పెట్టుకొని ఇష్టమైన ఆహారం తెప్పించుకుంటున్నారు.

యువతకు ఉపాధి..

ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లలో యువత డెలివరీ బాయ్స్‌గా ఉపాధి పొందుతున్నారు. కొందరు రోజులో కొంత సమయం చదువుకుని ఖాళీ సమయంలో డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు. కస్టమర్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వస్తువులను వారి ఇళ్ల వద్ద ఇచ్చి వెళ్తున్నారు. ఈ వ్యాపారం విస్తరించే కొద్దీ ఉపాధి అవకాశాలు ఇంకా పెరగనున్నాయి.



నల్లగొండలో ఆన్‌లైన్ డెలివరీ చేస్తున్న డెలివరీ బాయ్



డెలివరీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పార్సిళ్లు

పట్టణాల్లో ఆన్‌లైన్ డెలివరీ సెంటర్లు

ప్రతి మున్సిపాలిటీలో ఐదారు ఆన్‌లైన్ డెలివరీ సెంటర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అవి పట్టణ సమీపంలో ఉన్న గ్రామాలకు కూడా పార్సిళ్లు సప్లయ్ చేస్తున్నాయి. గుండు పిన్ను నుంచి రిఫ్రిజిరేటర్ వరకు ఆన్‌లైన్‌లో దొరికే ప్రతి వస్తువును కస్టమర్ల ఇళ్లకు చేర్చుతున్నాయి. ఒక్కో ఆన్‌లైన్ డెలివరీ సెంటర్‌కు నిత్యం 750 నుంచి 800 వరకు పార్సిళ్లు వస్తున్నాయి. ఒకట్రెండు చిన్న సెంటర్లకు 150 నుంచి 200 వరకు వస్తున్నాయి. పెద్ద పట్టణాల్లో నిత్యం నాలుగు వేల వరకు పార్సిళ్లు వస్తున్నాయి. ఇక పండుగలు, ఆఫర్లు ఉన్న సమయంలో వీటి సంఖ్య రెట్టింపు అవుతుంది.

సమయం, సొమ్ము ఆదా..

ఇంట్లో నుంచి ఆర్డర్ చేస్తే ఇంటికే వస్తువు వస్తోంది. దీనివల్ల సమయం, శ్రమ, సొమ్ము ఆదా అవుతోంది. ఏ సంస్థలు తక్కువ ధరకు ఇస్తున్నాయో.. నాణ్యత తదితర అంశాలు పరిశీలించే అవకాశం ఉండడంతో నచ్చిన వసువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు.

నగరాలకే పరిమితమైన ఆన్‌లైన్ ఆర్డర్ల వ్యాపారం ఇప్పుడు చిన్న పట్టణాలు, పల్లెలకు సైతం చేరింది. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ప్రపంచ మార్కెట్‌ను అరచేతిలో ఉంచుకుంటున్నారు. గడప దాటకుండానే వేల రూపాయల విలువైన ఆర్డర్లు చేస్తున్నారు. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకు అవసరమైన అన్ని రకాల వస్తువులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడం.. వాటికి ఆయా సంస్థలు ఆఫర్లు ఇస్తుండడంతో బయట మార్కెట్‌కు వెళ్లడం మాని ఆన్‌లైన్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్ వ్యాపారంలో ఉన్న పలు సంస్థలు పట్టణాలతో పాటు వాటికి సమీపంలో ఉన్న గ్రామాలకు కూడా వెళ్లి వస్తువులను అందిస్తుండడంతో ఈ వ్యాపారం మూడు ఆర్డర్లు.. ఆరు పార్సిళ్లు అన్నట్లు రోజురోజుకు విస్తరిస్తోంది.

– నల్లగొండ డెస్క్

షాపింగ్ సులభతరమైంది

ఏం కావాలన్నా ఆన్‌లైన్‌లో దొరుకుతాయి. షాపులకు వెళ్లి వెతుక్కోకుండా ఇంట్లోనే ఉండి ఏ వస్తువు.. ఎంత ధర ఉన్నది.. అన్న విషయాలు తెలుసుకోవచ్చు. బుక్ చేసుకుంటే నేరుగా ఇంటికే వస్తోంది. దీంతో సమయం వృథా కావడం లేదు. ఆఫర్లు ఇస్తుండడంతో డబ్బులు ఆదా అవుతాయి.

– దేగల రాజు, సూర్యాపేట

గ్రామాల్లోకి చొచ్చుకెళ్తున్నాయి

సమాచార విప్లవం తెచ్చిన మార్పులతో ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విదేశాలలో చదివే వారు, ఉద్యోగాలు చేసేవారి సంఖ్య పెరిగింది. వారు తాము నివసించే పెద్ద పట్టణాల్లో ఆన్‌లైన్ ఆర్డర్లకు అలవాటు పడి గ్రామాలకు వచ్చినపుడు కూడా అదే పని చేస్తున్నారు. దీంతో పల్లెలకు ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. ఈ అవకాశాన్ని బహుళజాతి కంపెనీలు కూడా వినియోగించుకొని గ్రామాల్లోకి చొచ్చుకొనిపోతున్నాయి. ముున్ముందు వీధి చివరన ఉండే పచారీ దుకాణం కనుమరుగయ్యే రోజులు దగ్గర పడ్డాయనడంలో సందేహం లేదు.

– బడుగుల సైదులు, ఆర్థిక విశ్లేషకుడు

పది మంది ఉపాధి పొందుతున్నారు



నల్లగొండ పట్టణంలో నేను 15 ఏళ్లుగా ఆన్‌లైన్ కొరియర్ సర్వీస్ నడుపుతున్నాను. 2007 – 08 సంవత్సరంలో నా వద్దకు రోజుకు 5 నుంచి 10 పార్సిళ్లు వచ్చేవి. ప్రస్తుతం రోజుకు 800 నుంచి 1000 పార్సిళ్ల వరకు వస్తున్నాయి. ఆన్‌లైన్‌ఆర్డర్లలో దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, గృహోపకరణాలు, మొబైల్ ఫోన్లు, మెడిసిన్లు, వ్యవసాయానికి సంబంధించిన మందులు తదితర వస్తువులు ఎక్కువగా వస్తాయి. మా కొరియర్ సర్వీస్‌లో పది మంది డెలివరీ బాయ్స్‌గా ఉపాధి పొందుతున్నారు. మేము ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పార్సిళ్లను డెలివరీ చేస్తాం.

– బొడ్డుపల్లి సైదులు, జీఎంఎస్ కొరియర్ సెంటర్, నల్లగొండ



సూర్యాపేటలోని ఓ ఆన్‌లైన్ డెలివరీ సెంటర్‌లో పార్సిళ్లు



నల్లగొండలో పార్సిళ్లను అన్‌లోడ్ చేస్తున్న డెలివరీ సెంటర్ నిర్వాహకులు



సూర్యాపేటలోని ఆన్‌లైన్ డెలివరీ సెంటర్‌లో పార్సిళ్లను సరిచూసుకుంటున్న సిబ్బంది

ఆన్‌లైన్ మార్కెటింగ్ పెరిగింది



ప్రస్తుతం ఆన్‌లైన్ మార్కెటింగ్ బాగా పెరిగింది. మా సంస్థకు నల్లగొండ, చౌటుప్పల్, దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడలో డెలివరీ సెంటర్లు ఉన్నాయి. నల్లగొండలోని సెంటర్‌కు రోజూ వెయ్యి వరకు పార్సిళ్లు వస్తాయి. పండుగలు, ప్రత్యేక ఆఫర్లు ఉన్న రోజుల్లో వీటి సంఖ్య డబుల్ అవుతుంది. మిగతా పట్టణాల్లో కూడా అలాగే ఉంటుంది. ఇప్పుడు నల్లగొండ స్టేషన్‌లో 24 మంది డెలివరీ బాయ్స్ పని చేస్తున్నారు. సేవలను విస్తరించేందుకు మరికొంత మంది కావాల్సి ఉంది. నల్లగొండ చుట్టు పక్కల గ్రామాలకు సైతం పార్సిళ్లు సరఫరా చేస్తున్నాం.

– మాధవ్, సూపర్‌వైజర్, అమెజాన్ స్టేషన్, నల్లగొండ

వస్తువులన్నీ ఆన్‌లైన్‌లోనే కొంటున్నా



ఆన్‌లైన్‌లో ఎలాంటి వస్తువు కావాలన్నా దొరుకుతుంది. వస్తువులు నాణ్యతతో పాటు ధర కూడా తక్కువగా ఉంటోంది. పండుగ, ఇతర ప్రత్యేక రోజుల్లో ఆఫర్ పెట్టి అమ్మకాలు చేస్తున్నారు. గతంలో సందర్భాన్ని బట్టి కొనుగోలు చేసే వాళ్లం. కానీ, ఆఫర్ పెట్టే సమయంలో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నాం.

– షారోజ్, భువనగిరి

‘పేట’లో యువకుడిపై కత్తులతో దాడి

- అడ్డువచ్చిన వారిపై రాళ్లు, కత్తులతో బెదిరింపులు
- గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన స్థానికులు
- పోలీసుల అదుపులో నిందితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీకూరి సంతోష్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం : అందరూ చూస్తుండగానే నడిరోడ్డులో ఓ యువకుడిపై మరో నలుగురు యువకులు కత్తులతో, రాళ్లతో దాడికి దిగారు. ఈ ఘటన గురువారం సూర్యాపేట పట్టణ నడిబొడ్డున పట్టపగలు చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన చీకూరి సంతోష్ గురువారం ఇంటి నుంచి కొత్త బస్టాండ్ వద్దకు పనినిమిత్తం బైక్ వెళ్తున్నాడు.. అది గమనించిన మామిళ్లగడ్డకు చెందిన మాల బంటి పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని తన స్నేహితులు మహేష్, సన్నిలతో కలిసి సంతోష్ బైక్‌ను వెంబడించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు వెళ్లగానే సంతోష్‌ను బైక్‌పై నుంచి కిందపడేసి అందరూ చూస్తుండగానే కత్తితో 20పోట్లకు పైగా పొడిశారు. సుమారు అరగంట పాటు కత్తులతో వీరంగం సృష్టించారు. అనంతరం నిందితులు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

అడ్డుకున్న స్థానికులపైనా దాడి..

తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సంతోష్‌ను కత్తులు, బండరాళ్లతో దాడి చేస్తుండగా అడ్డుకున్న స్థానికులపై బంటి దాడికి దిగారు. అయినా స్థానికులు లెక్కచేయకుండా సంతోష్‌ను ఆటోలో స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గంజాయి, మద్యానికి బానిసలై..

మాల బంటి, మహేష్, సన్ని గంజాయి, మద్యానికి బానిసలై ఎవరిపైన పడితే వారిపై కత్తులు, రాడ్లతో దాడులకు దిగడం పరిపాటిగా మారింది. వారితో పాటుగా తాళ్లగడ్డ, జేజేనగర్, అంబేద్కర్‌నగర్‌కు చెందిన మరికొందరు యువకులు సైతం గంజాయి, మద్యానికి బానిసై ఏకంగా సుఫారి తీసుకొని హత్యలు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు వేడుకుంటున్నారు.

అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు

రోడ్లపై యువకులు కత్తులతో వీరంగం సృష్టిస్తే ఉపేక్షించేది లేదు. ప్రజలకు భయభ్రాంతులకు గురిచేసే అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటాం. జిల్లాలో గంజాయిని సమూలంగా మార్చేశాం. గంజాయి విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యువకులు సన్మార్గంలో నడవాలి తప్ప.. చెడుమార్గాల్లో పయనిస్తే భవిష్యత్‌కు ముప్పు తప్పదు.

– రాజేంద్రప్రసాద్, ఎస్పీ, సూర్యాపేట

గతంలో ఘటనలు ఇవీ..

- పట్టణంలో మూడు నెలల క్రితం బంటి పలువురు యువకులతో ఫూటుగా మద్యం సేవించి.. మిని ట్యాంక్‌బండ్‌పై వాకింగ్ చేస్తున్న యువతులను ర్యాగింగ్ చేయడంతో పాటుగా ఏకంగా అడ్డుకున్నారు. అక్కడ ఉన్న ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ అడ్డుతగలగా ఆయనతో ఘర్షణకు దిగి దాడి చేయబోయారు.
- అదే విధంగా తాళ్లగడ్డలో ఆరు నెలల క్రితం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమీపంలో పది మంది యువకులు గంజాయి, మద్యం సేవించి రాడ్లు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో అడ్డువచ్చిన మరో నలుగురిపై కూడా దాడికి పాల్పడ్డారు.
- 8నెలల క్రితం మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో 50మందికి పైగా అక్కడి చేరి ఒకరిపై ఒకరు కత్తులతో దాడులు చేసుకున్నారు.

సుపారీ హత్యల్లో పాలుపంచుకుంటున్న తాళ్లగడ్డ, మామిళ్లగడ్డ గ్రూపులు..

మద్యంతో పాటుగా గంజాయికి కూడా సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డ, జేజేనగర్, మామిళ్లగడ్డలు అడ్డాలుగా మారిపోయాయి. ఒకప్పుడు రాజీవ్‌నగర్ అంటేనే వణికిపోయే పరిస్థితి. కాని ప్రస్తుతం తాళ్లగడ్డ, మామిళ్లగడ్డ అంటేనే వణికిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మామిళ్లగడ్డ, తాళ్లగడ్డలో ఓ ఎనిమిది మంది యువకులు మద్యం, గంజాయికి బానిసలుగా మారి సుపారీ తీసుకొని హత్యల్లో కూడా పాలుపంచుకుంటున్నట్లు సమాచారం.

విచ్చలవిడిగా మద్యం, గంజాయి..

జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, నేరేడుచర్ల, తిరుమలగిరి పట్టణాల్లో మద్యంతో పాటుగా గంజాయి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. దీంతో మద్యం, గంజాయి మత్తులో పలవురు యువకులు రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నారు.

అదుపుతప్పి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- బీబీనగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఘటన



బోల్తా పడిన బస్సు

బీబీనగర్ : హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున బీబీనగర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ యుగేంధర్, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బుధవారం సాయంత్రం 30మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి బయల్దేరి హైదరాబాద్ మీదుగా వరంగల్‌కు వెళ్తుంది. గురువారం తెల్లవారుజామున 6గంటల సమయంలో బస్సు బీబీనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే డ్రైవర్ ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోగా ఒక్కసారిగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. అప్రమత్తమైన బస్సులోని ప్రయాణికులు అద్దాలను పగులగొట్టుకొని సురక్షితంగా బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్పగాయాలు కాగా, మిగతా వారు క్షేమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. స్వల్ప గాయాలైన ప్రయాణికులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అయితే సర్వీస్ రోడ్డు వెంట చిన్న చిన్న చెట్లను బస్సు ఢీకొట్టడంతో దాని వేగం తగ్గిపెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది.

కత్తితో గుర్తు తెలియని వ్యక్తి దాడి

- అల్వాలపహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తి మృతి



వెంకన్న (ఫైల్)

త్రిపురారం : గుర్తు తెలియని వ్యక్తులు మరో వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని చెన్నాయిపాలెం గ్రామ పంచాయతీ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్వాలపహాడ్ గ్రామానికి చెందిన బొలిగోర్ల వెంకన్న(44) గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఏకాదశి సందర్భంగా అడవిదేవులపల్లి మండలంలోని సత్రశాల వద్దకు దైవదర్శనం కోసం వెంకన్న ఆయన బావమ్మర్ది రావుల కోటయ్యతో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో చెన్నాయిపాలెం గ్రామ శివారులోని అల్వాలపాడు ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్ వచ్చి వెనకాల బైక్‌పై కూర్చున్న బొలిగోర్ల వెంకన్నపై కత్తితో మెడ భాగంలో పొడిచారు. ఇది గమనించిన అల్వాలపాడు గ్రామస్తులు వెంకన్నను ఆటోలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన వెంకన్న పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. బావమ్మర్ది కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హాలియా సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

రోడ్డుపై మృతుడి బంధువుల ఆందోళన..

కత్తి దాడిలో మృతి చెందిన వెంకన్న బంధువులు మిర్యాలగూడలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు నిందితుడిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైళ్లలో దొంగల బెడద పెరిగింది

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



శ్రీకాంత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

సాక్షి యాదాద్రి : రైళ్లలో దొంగల బెడద పెరిగిందని, ప్రయాణికులపై దాడి చేసి సెల్‌ఫోన్లు, నగదు ఎత్తుకెళ్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద తన నియోజకవర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీకాంత్ మృతదేహాన్ని సందర్శించి తల్లిదండ్రులను పరామర్శించారు. రైల్లో ఫుట్‌బోర్డు పక్కన ప్రయాణిస్తున్న శ్రీకాంత్‌వద్ద గల సెల్‌ఫోన్‌ను దొంగలు లాక్కునే ప్రయత్నం చేశారన్నారు. కర్రతో చేతులపై కొట్టడంతో చేతిలోంచి జారిపోయిన సెల్‌ఫోన్‌ను శ్రీకాంత్ కాపాడుకునే ప్రయత్నంలో రైలు నుంచి కింద పడి మృతిచెందాడన్నారు. రైళ్లలో ప్రయాణికుల భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడుతానని ఈటల అన్నారు.

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ముగ్గురు ప్రయాణికులకు గాయాలు



సహాయక చర్యల్లో ఎస్ఐ నరేష్‌కుమార్

మాడుగులపల్లి : రోడ్డు వెంట నిలిపిఉన్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటన మండలంలోని కుక్కడం గ్రామ శివారులో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై జరిగింది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కావేరి పట్రావెల్స్ సంస్థకు చెందిన బస్సు 33మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి చెన్నైకి బయల్దేరింది. గురువారం రాత్రి 2గంటల సమయంలో కుక్కడం శివారుకు రాగానే అదుపుతప్పి రోడ్డు వెంట నిలిపి ఉంచిన ఆయిల్ ట్యాంకర్‌ను వేగంగా ఢీకొట్టింది. ప్రమాదదాటికి బస్సు క్యాబిన్ పూర్తిగా ధ్వసమైంది. దీంతో బస్సులో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఉదయం మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ పరిశీలించారు. హైవే పెట్రోలింగ్ అధికారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

రేపు ప్రత్యేక బస్ సర్వీసులు

నార్కట్‌పల్లి : జూలై 1న గ్రూప్– 4 పరీక్ష ఉన్నందున ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా నార్కట్‌పల్లి డిపో నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ వెంకటమ్మ గురువారం తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నార్కట్‌పల్లి డిపో నుంచి – ఎంజీ యూనివర్సిటీ, నార్కట్‌పల్లి–నకిరేకల్, నార్కట్‌పల్లి–నల్లగొండ రూట్ల లో ప్రత్యేక సర్వీసులు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి కిడ్నాప్.. ఛేదించిన పోలీసులు

పాలకవీడు: యువకుడిని కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు అందిన వెంటనే వేగంగా స్పందించిన పోలీసులు గంటల వ్యవధిలోనే కిడ్నాపర్లను అరెస్టు చేశారు. గురువారం ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన పాలెల్లి గోపి గొర్రెల క్రయ విక్రయాలకు సంబంధించి ఒకరికి రూ.1,47,000 చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బు చెల్లింపునకు సంబంధించి కోదాడ పట్టణానికి చెందిన మడతనపల్లి లింగయ్య జామీనుగా ఉన్నాడు. గోపి డబ్బులు ఇవ్వకపోగా గత రెండు నెలల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. అయితే గోపి పాలకవీడు మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్న మడతనపల్లి లింగయ్య తనకు పరిచయం ఉన్న కొందరు వ్యక్తులను కారులో బుధవారం రాత్రి 10గంటల సమయంలో బొత్తలపాలెం తీసుకెళ్లి గోపి ఉన్న ఇంట్లోకి చొరబడి అతడిని కొట్టుకుంటూ కారులోకి ఎక్కించి తీసుకెళ్లారు. వెంటనే గోపి బంధువైన కోనూరు సైదులు పాలకవీడు పోలీసులకు విషయం తెలియజేయడంతో వారు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం చేరవేశారు. అప్రమత్తమైన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా కోదాడ సమీపంలో కారు, ఆరుగురు కిడ్నాపర్లను అదుపులోకి తీసుకుని గోపిని రక్షించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకుని రిమాండ్ చేసి హుజూర్‌నగర్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE
■ నల్లగొండ పట్టణం న్యూకలెక్టరేట్ ప్రక్కన G+1 పర్మిషన్ గల ఇల్లు 120 చ॥గజాలు 900 SFT గలది అమ్మబడును. ధర: 30 లక్షలు, సంప్ర॥ 8341550528 [YA-14879]

HOUSE FOR SALE
■ Ready to Occupy Duplex Luxury Villas In the Best Gated Community at Miryalaguda Next to New D-mart Clubhouse, Swimming Pool Fully Operational Must See! Call: 7013578378. [H-780829]

Wanted
■ శ్రీ విఘ్నేశ్వర హోండా నల్లగొండ యందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్, సర్వీస్ సూపర్‌వైజర్స్ (Male) మరియు నార్కట్‌పల్లి యందు సేల్స్ ఎగ్జిక్యూటీవ్ కావలెను. సంప్ర॥ 92900 53788, 92901 43623 [Y-14878]
■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221323]
■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6172]

Services

OLD AGE HOME
■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781637]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010422240, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి చిన పిదప ప్రతిస్పందించ చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.